
andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
శుక్రవారం ఉష్ణోగ్రత గరిష్ఠం 42.8, కనిష్ఠం 26.7



వచ్చే నెల 'రసాయన శాస్త్రం'పై జాతీయ సదస్సు



కరపత్రం ఆవిష్కరిస్తున్న అధ్యాపకులు

నిర్మల్ కల్చరల్, మే 3 : నిర్మల్ ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో జూన్ నెలలో జాతీయసదస్సు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ భీమ్‌రావు తెలిపారు. శుక్రవారం కరపత్రం విడుదల చేశారు. సుస్థిత అభివృద్ధి రసాయనశాస్త్రం, దాని అనుబంధ శాస్త్రాల పాత్ర అనే అంశంపై రెండు రోజుల సదస్సు ఏర్పాటు చేశామన్నారు. సదస్సు తేదీలు త్వరలో ప్రకటిస్తామన్నారు. సదస్సు కన్వీనర్, కో కన్వీనర్ సరితారాణి, రమా కాంత్‌గౌడ్, అధ్యాపకులు పాల్గొన్నారు.





రాహుల్ టూర్‌కు రంగం సిద్ధం

- రేపు నిర్మల్‌లో భారీ బహిరంగ సభ
- ఏర్పాట్లలో తలమునకలైన కాంగ్రెస్ శ్రేణులు
- మండలాల వారీగా జన సమీకరణ బాధ్యతలు
- బలం చాటుకునేందుకు వేదికగా హస్తం ప్రయత్నాలు



నిర్మల్, మే 3 (ఆంధ్రజ్యోతి) : పార్లమెంట్ ఎన్నికల ప్రచారవేడి పతాక స్థాయికి చేరుకుంటున్న నేపథ్యంలో అన్ని ప్రధాన రాజకీయ పార్టీలు తమ ఎన్నికల ప్రచారం కోసం అగ్రనేతలను రంగంలోకి దించేందుకు సిద్ధమవుతున్నాయి. ఇందులో భాగంగానే కాంగ్రెస్ పార్టీ మొట్టమొదటగా అగ్రనేతలతో ప్రచారపర్వానికి శ్రీకారం చుట్టబోతోంది. ఆదివారం నిర్మల్‌లో ఏకంగా ఆ పార్టీ అగ్రనేత రాహుల్‌గాంధీ చేత ఎన్నికల ప్రచార శంఖారావం పూరించబోతోంది. ఇప్పటికే జిల్లా ఇన్‌చార్జీ మంత్రి సీతక్క లోక్‌సభ నియోజకవర్గ పరిధిలో విస్తృతంగా మండుటెండలను సైతం లెక్క చేయకుండా ప్రచారం కొనసాగిస్తోంది. దీంతో పాటు ఆ పార్టీకి చెందిన డీసీసీ అధ్యక్షులు శ్రీహరిరావుతో పాటు మరికొంతమంది ముఖ్యనాయకులు ముమ్మర ప్రచారం నిర్వహిస్తున్నారు. అయితే రోజురోజుకు ప్రచారపర్వం వేడెక్కుతున్న క్రమంలో కాంగ్రెస్ పార్టీ తమ అగ్రనేత రాహుల్‌గాంధీతో ప్రచారపర్వాన్ని చేపట్టేందుకు సిద్ధమైంది. అయితే ఆదివారం జిల్లాకేంద్రంలో భారీ ఎత్తున బహిరంగసభను కాంగ్రెస్ పార్టీ నిర్వహించబోతోంది. ఈ సభకు లోక్‌సభ నియోజకవర్గంలోని జనాలనే కాకుండా పొరుగు జిల్లాల నుంచి సైతం జనాన్ని సమీకరించేందుకు కాంగ్రెస్ పార్టీ నేతలు సమాయత్తమవుతున్నారు. రాహుల్‌గాంధీతో పాటు మరికొంతమంది ఎఐసీసీ అగ్రనేతలు అలాగే సీఎం రేవంత్‌రెడ్డి మరికొంతమంది మంత్రులు ఈ బహిరంగ సభకు హాజరుకాబోతున్నారు. కాగా రాహుల్‌సభను కనీవిని ఎరుగని రీతిలో సక్సెస్ చేసి తమ బలాన్ని చాటుకునేందుకు కాంగ్రెస్ పార్టీ సమాయత్తమవుతోంది. జనసమీకరణ కోసం మండలాల వారీగా అక్కడి నేతలకు బాధ్యతలు అప్పగిస్తున్నారు. భారీగా జనాన్ని సమీకరించి తమ సత్తాను చాటుకునేందుకే కాకుండా పార్టీకి పూర్వవైభవం సమకూరిందన్న సంకేతాలు పంపేందుకు ప్రయత్నాలు చేస్తోంది. కాగా సభకు సంబంధించిన ఏర్పాట్లను మంత్రి సీతక్క తన భుజస్కందాలపై వేసుకుంటున్నారు. ఓ వైపు పార్టీ లోక్‌సభ అభ్యర్థులు సీతక్కతో కలిసి ఎన్నికల ప్రచారాన్ని నిర్వహిస్తూనే మరోవైపు రాహుల్ బహిరంగసభకు సంబంధించిన ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మబొజ్జుతో పాటు జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు శ్రీహరిరావు, ముథోల్ మాజీ ఎమ్మెల్యే నారాయణ రావు పటేల్‌లతో పాటు తదితరులు జన సమీకరణపై దృష్టి కేంద్రీకరిస్తున్నారు. బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలకు ధీటైన జవాబు ఇచ్చేందుకు వారు స్థానిక సమస్యలను సైతం రాహుల్‌గాంధీ చేత ప్రస్తావింపజేసేందుకు సమాయత్తమవుతున్నారు.

ఏర్పాట్లలో తలమునకలైన నేతలు

కాంగ్రెస్ పార్టీ నేతలంతా రాహుల్‌గాంధీ టూర్‌ను ప్రతిష్టాత్మకంగా తీసుకుంటున్నారు. రెండు, మూడు లోక్‌సభ నియోజకవర్గాలను కేంద్రంగా చేసుకొని రాహుల్‌గాంధీ పర్యటనను ఏఐసీసీ వర్గాలు ఖరారు చేశాయి. ఇందులో భాగంగానే నిర్మల్‌ను అటు ఆదిలాబాద్, నిజామాబాద్ లోక్‌సభ నియోజకవర్గాలను కలిపి ఈ టూర్‌ను ఏర్పాటు చేశారు. ఈ రెండు నియోజకవర్గాల నుంచి భారీసంఖ్యలో కార్యకర్తలను తరలించే విధంగా ఏర్పాట్లు చేస్తున్నారు. అయితే పీసీసీ వర్గాలు రాహుల్ పర్యటనను ప్రతిష్టాత్మకంగా తీసుకోవడం అలాగే నిర్మల్ నేతలకు జనసమీకరణకు సంబంధించిన టార్గెట్‌ను ఖరారు చేయడంతో ఇక్కడి నేతలంతా గత వారం రోజుల నుంచి రాహుల్ టూర్‌పైనే దృష్టి కేంద్రీకరిస్తున్నారు. ఎక్కడికక్కడ నియోజకవర్గాలు, మండల, గ్రామస్థాయిలో జనసమీకరణ బాధ్యతలను అక్కడి స్థానిక నేతలకు అప్పగిస్తున్నారు. దీంతో జన సమీకరణపైనే నేతలంతా సీరియస్‌గా దృష్టి సారిస్తూ ఆ దిశగా సిద్ధమవుతున్నారు. ఆదివారం సెలవుదినం కావడంతో జనంభారీగా తరలివచ్చే అవకాశం ఉందని పార్టీ వర్గాలు భావిస్తున్నాయి. దీనికి అనుగుణంగా సభాస్థలి వద్ద ఏర్పాట్లు చేపడుతున్నారు. ఎండల తీవ్రత ఎక్కువగా ఉన్న జనానికి అసౌకర్యాలు లేకుండా ఆ దిశగా ఏర్పాట్లు చేస్తున్నారు.

బలం చాటుకునేందుకు

ఇదిలా ఉండగా మొన్నటి అసెంబ్లీ ఎన్నికల్లో జరిగిన పరాభవం నుంచి తెరుకొని కాంగ్రెస్ పార్టీ మళ్లీ క్రమంగా బలం చాటుకుంటోంది. ఈ నేపథ్యంలోనే లోక్‌సభ ఎన్నికలు రావడం, పార్టీ అధికారంలో ఉన్న కారణంగా బీఆర్ఎస్ పార్టీకి చెందిన చాలా మంది సీనియర్ నాయకులు, కార్యకర్తలు అంతా కాంగ్రెస్ పార్టీలో చేరుతుండడంతో ఆ పార్టీ పూర్వవైభవం దిశగా అడుగులు వేస్తున్నట్లు కనిపిస్తోంది. దీనికి అనుగుణంగానే కొద్దిరోజుల నుంచి ఆ పార్టీ చేరికలపై ఎక్కువ ఫోకస్ పెట్టింది. ఆ పార్టీ నేతలు భావిస్తున్నట్లుగా బీఆర్ఎస్ నేతలంతా కాంగ్రెస్‌లో చేరేందుకు క్యూకడుతున్నారు. ఇప్పటికే ఆ పార్టీ జిల్లాలో దాదాపు ఖాళీ అయ్యింది. ఇలాంటి సందర్భాలన్నింటిని అనుకూలంగా మలుచుకొని ఇటు లోక్‌సభ ఎన్నికలను అటు రాహుల్ పర్యటనను సక్సెస్ చేసి తిరిగి పూర్వవైభవంను సంతరించుకునే దిశగా కాంగ్రెస్ పార్టీ అడుగులు వేస్తున్నట్లు చెబుతున్నారు.

గెలుపే టార్గెట్

బీఆర్ఎస్ పార్టీ నుంచి పెద్ద సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీలో చేరడం, దీనికి తోడు కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉండడం అలాగే పెద్ద ఎత్తున సంక్షేమ, అభివృద్ధి పథకాలను అమలు చేస్తుండడం లాంటి అంశాలను ఆ పార్టీ ఈ సారి పెద్దఎత్తున ప్రచారం చేస్తోంది. ఈ అంశాలను ప్రజల్లోకి బలంగా తీసుకువెళ్లి ఎలాగైనా గెలుపు సాధించేందు కోసం వ్యూహారచన సాగిస్తోంది. గత పరాభవాలకు ప్రతీకారంగా ఈ ఎన్నికల్లో గెలుపు సాధించి బీజేపీ, బీఆర్ఎస్ పార్టీకి చెక్ పెట్టాలని కాంగ్రెస్ పార్టీ సిద్ధమవుతోంది.



సభాస్థలి ఏర్పాట్లను పరిశీలించిన మంత్రి సీతక్క

- పాల్గొన్న డీసీసీ చీఫ్, నేతలు

నిర్మల్ కల్చరల్, మే 3 : కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్‌గాంధీ పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదిలాబాద్, నిర్మల్ జిల్లాకు రానున్నారు. అక్కడ జరిగే బహిరంగసభలో ప్రజలను ఉద్దేశించి ప్రసంగించనున్నారు. శుక్రవారం మంత్రి సీతక్క, ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు, డీసీసీ చీఫ్ కే. శ్రీహరిరావు తదితర నేతలతో కలిసి బహిరంగ సభాస్థలి ఏర్పాట్లను పరిశీలించారు. కలెక్టరేట్ రోడ్డు ప్రాంతంలో బహిరంగసభ వేదికను ఏర్పాటు చేస్తున్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, తదితర నాయకులు ఈ సభకు హాజరు కానున్నారని మంత్రి సీతక్క తెలిపారు. ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా సభా ప్రాంగణంలో అన్ని ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ట్రాఫిక్, తాగునీరు, టెంట్ తదితర ఏర్పాట్లు చేస్తున్నట్లు వివరించారు. మాజీ కేంద్ర మంత్రి వేణుగోపాలచారి, ఆసిఫాబాద్ ఇన్‌చార్జి అజ్మీరా శ్యామ్‌నాయక్, మున్సిపల్ చైర్మన్ ఈశ్వర్, మాజీ చైరమన్ గణేష్, నాందేడపు చిన్ను, తదితర నాయకులు పాల్గొన్నారు.

దుర్గంధ భరితం.. క్రీడా ప్రాంగణం



క్రీడా ప్రాంగణంలోకి నీరు చేరిన దృశ్యం

దస్తూరాబాద్, మే 3 : ప్రజలకు శారీరక, మానసిక ఉల్లాసాన్ని కలిగించాలనే లక్ష్యంతో గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పాటు చేసిన క్రీడా మైదానాల లక్ష్యం నీరుగారిపోతుంది. మండలంలోని మున్యాల్ గ్రామంలో ఏర్పాటు చేసిన క్రీడా మైదానంలోకి నీరు చేరి దుర్గంధ భరితంగా మారడం ఇందుకు నిదర్శనం. వేసవికాలంలో పిల్లలు ఆడుకోవడానికి ఉపయోగపడే క్రీడా ప్రాంగణాలను పట్టించుకునే నాథులు కరువవ్వడంతో ఇలా నిరుపయోగంగా మారుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

బీఆర్ఎస్ పార్టీకి సోషల్ మీడియా అధ్యక్షుడి రాజీనామా

నిర్మల్ కల్చరల్, మే 3 : సోషల్ మీడియా నిర్మల్ జిల్లా అధ్యక్షుడు అఖిల్ రెబల్ బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేశారు. శుక్రవారం ఆయన ఈ మేరకు కేటీఆర్‌కు రాజీనామా లేఖను పంపించానని ఒక ప్రకటనలో తెలిపారు.

జీతభత్యాలు విడుదల చేయండి

నిర్మల్ కల్చరల్, మే 3 : మార్కెట్ కమిటీలలో పని చేస్తున్న ఉద్యోగులు, పెన్షనర్లకు జీతాలు సకాలంలో జమ చేయాలని ఉమ్మడి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఫైజ్ అహ్మద్, గోనే శంకర్ ఒక ప్రకటనలో కోరారు. జీతాలు రాక ఇబ్బందులు పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు.


నిర్మల్ చరిత్ర రచయిత మృతికి సంతాపం

నిర్మల్ కల్చరల్, మే 3 : విశ్రాంత ఉపాధ్యాయుడు, నిర్మల్ చరిత్ర రచయిత అంకం రాములు మృతి పట్ల తెలంగాణ రచయితల వేదిక ఒక ప్రకటనలో సంతాపం ప్రకటించింది. దామెర రాములు, నేరెళ్ల హన్మంతు, తుమ్మల దేవరావు, పత్తి శివప్రసాద్, రాములు కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. రచయితగా ఆయన కృషిని కొనియాడారు.

19న కౌండిన్య వధూవరుల పరిచయ వేదిక

నిర్మల్ కల్చరల్, మే 3 : ఈ నెల 19న కౌండిన్య వధూవరుల పరిచయ వేదికను భైంసాలోని గరుకృప ఒకేషనల్ జూనియర్ కాలేజీలో ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు కే.రామగౌడ్, రామకృష్ణగౌడ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

రైతులను ఇబ్బందులకు గురి చేయొద్దు



కల్లూర్ జొన్నల కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న మార్క్‌ఫెడ్ డీఎం

కుంటాల, మే, 3 : కొనుగోలు కేంద్రాలలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్త కుండా చూడాలని మార్క్‌ఫెడ్ డీఎంప్రవీణ్‌రెడ్డి అన్నారు. శుక్రవారం కుంటాల మండలంలోని కల్లూరు, కుంటాల, పెంచికల్‌పాడ్ గ్రామాలలో జొన్నల కొనుగోలు కేంద్రాలను ఆయన పరిశీలించారు. ఈ సంద ర్భంగా రైతులు సరైన తేమశాతంతో కూడిన ధాన్యాన్ని తీసుకవచ్చి కేంద్రాల్లో విక్రయించి లబ్ధిపొందాలన్నారు. పలువురు రైతులు ఎకరానికి ఎనిమిదిన్నర క్వింటాళ్ల జొన్నలను మాత్రమే ప్రభుత్వం కొనుగోలు చేస్తుండడంతో రైతుకు ఎకరానికి దాదాపు 20 క్వింటాళ్ల వరకు దిగుబడి వస్తుండడంతో మిగితావి ఎక్కడ విక్రయించాలని రైతులు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఆయన ఉన్నతాధి కారుల దృష్టికి తీసుకెళ్లి సమస్యను పరిష్కరిస్తామన్నారు.

ఈవీఎం కమిషనింగ్ ప్రక్రియ వెంటనే చేపట్టాలి

- జిల్లా ఎన్నికల అధికారి ఆశిష్ సంగ్వాన్



మాట్లాడుతున్న కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

నిర్మల్ కల్చరల్, మే 3 : ఎన్నికల సంఘం నిబంధనలకు అనుగుణంగా ఈవీఎం కమిషనింగ్ ప్రక్రియ వెంటనే చేపట్టాలని జిల్లా ఎన్నికల అధికారి ఆశిష్ సంగ్వాన్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఎన్టీఆర్ మినీ స్టేడియంలో ఈవీఎం కమిషనింగ్ ప్రక్రియ పరిశీలించారు. అన్ని రాజకీయ పార్టీల సమక్షంలో ఈవీఎం ప్రకియ చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... ఈవీఎం స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద విధులు నిర్వహించే సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. కమిషనింగ్ ప్రక్రియను ఆర్డీవో రత్న కల్యాణిని అడిగి తెలుసుకున్నారు. తహసీల్దార్లు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

రైస్‌మిల్లింగ్ ప్రక్రియ వంద శాతం పూర్తి చేయాలి

కస్టం మిల్లింగ్ బియ్యం ప్రక్రియ వంద శాతం పూర్తి చేయాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ ఆదేశించారు. శుక్రవారం మిల్లర్లు, అధికారులతో సమావేశం నిర్వహించారు. ప్రభుత్వ నిబంధనలను పాటించి ధాన్యం కొనుగోళ్లు చేయాలన్నారు. మిల్లర్లు నిబంధనలు పాటించాలని లేనట్టయితే కఠిన చర్యలుంటాయన్నారు. మిల్లర్ల వారీగా కొనుగోళ్ల వివరాలు అడిగి తెలుసుకున్నారు. అదనపు కలెక్టర్ కిషోర్‌కుమార్, అధికారులు నందిత, శ్రీకళ పాల్గొన్నారు.

ఎన్నికల నిర్వహణ సమయం పెంపు

ఎన్నికల సంఘం పార్లమెంట్ ఎన్నికల సమయాన్ని పెంచిందని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ తెలిపారు. శుక్రవారం విడుదల చేసిన ప్రకటనలో ఎండల ఉష్ణోగ్రతలు పెరగడంతో ఎన్నికల కమిషనర్ సమయం పెంచుతూ ఆదేశాలు జారీ చేశారన్నారు. ఉదయం 7 గంటల నుండి సాయంత్రం 6 గంటల వరకు ఈ నెల 13న పోలింగ్ ఉంటుందని తెలిపారు. ప్రజలు ఓటు హక్కు వినియోగించు కోవాలని కోరారు.

కాంగ్రెస్‌తోనే ప్రజా సంక్షేమం

- ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు
- కాంగ్రెస్ గూటికి చేరిన పలువురు బీఆర్ఎస్ నాయకులు



తర్లపాడ్‌లో ఎమ్మెల్యే సమక్షంలో కాంగ్రెస్‌లో చేరుతున్న బీఆర్ఎస్ యూత్ మండల అధ్యక్షుడు

ఖానాపూర్, మే 3 : కాంగ్రెస్‌తోనే ప్రజాసంక్షేమం సాధ్యమని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మబొజ్జు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని క్యాంప్ కార్యాలయంతో పాటు మండలంలోని తర్లపాడ్, సత్తెనపల్లి గ్రామాల్లో నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. 5వ తేదీన నిర్మల్‌కు రాహుల్ గాంధీ రానున్నట్లు ఎమ్మెల్యే పేర్కొన్నారు. రాహుల్‌గాంధీ సభకు ఆదిలాబాద్ పార్లమెంట్ నలుమూలల నుంచి పార్టీ శ్రేణులు, ప్రజలు భారీగా తరలి రావాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు.

ఖానాపూర్‌లో బీఆర్ఎస్‌కు మరో షాక్

ఖానాపూర్ బీఆర్ఎస్ పార్టీకి మరో షాక్ తగిలింది. ఆ పార్టీ అధికారం కోల్పోయిన నాటి నుంచి రోజు రోజుకు నియోజకవర్గంలో బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి వలసలు పెరుగుతున్నాయి. తాజాగా ఖానాపూర్ మండలంలో పీఏసీఎస్ మాజీ చైర్మన్, ప్రస్తుత జడ్పీటీసీ భర్త ఆకుల వెంకాగౌడ్, సుర్జాపూర్ మాజీ ఉప సర్పంచ్ సంగర్తి రాజన్నల ఆధ్వర్యంలో పలువురు సుర్జాపూర్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్‌లో చేరారు. తర్లపాడ్ గ్రామంలో నిర్వహించిన కార్యక్రమంలో బీఆర్ఎస్ యూత్ మండల ప్రెసిడెంట్ రామిడి మహేష్ ఆధ్వర్యంలో తర్లపాడ్ తాజా మాజీ ఉప సర్పంచ్ రామిడి నర్సయ్య, మాజీ వార్డు సభ్యులు కలమడుగు జ్యోతి లక్ష్మణ్, ఇప్ప వనిత సంతోష్ దంపతులు సహా సుమారు 30 మంది బీఆర్ఎస్ కార్యకర్తలు ఆ పార్టీని వీడి ఎమ్మెల్యే బొజ్జు సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. అనంతరం సత్తెనపల్లి గ్రామంలో నిర్వహించిన కార్యక్రమంలో పలువురు బీఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్ కండువా వేసుకున్నారు. అంతకుముందు ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో బాదనకుర్తి గ్రామానికి చెందిన బీజేపీ నాయకులు గుడాల రాజన్న ఆధ్వర్యంలో పలువురు ఎమ్మెల్యే సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. ఈ వేర్వేరు కార్యక్రమాల్లో మున్సిపల్ చైర్మన్ సత్యం, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు దొనికేని దయానంద్, కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు తదితరులున్నారు.

ప్రజలకు అందుబాటులో ఉండి సేవలందించాలి

- జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్



కల్లూర్‌లో పంచాయతీ కార్యదర్శులతో మాట్లాడుతున్న డీపీవో

కుంటాల, మే, 3 : పంచాయతీ కార్యదర్శులు ప్రజలకు ఎల్ల వేళలా అందుబాటులో ఉంటూ సేవలందించాలని డీపీవో శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం మండలంలోని కల్లూర్‌లో లోకేశ్వరం, కుంటాల మండలాల పంచాయతీ కార్యదర్శులకు ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సిబ్బందితో మాట్లాడుతూ గ్రామాలలో పారిశుధ్యం పనులను ఎప్పటికప్పుడు చేపట్టాలని అంతేగాకుండా గ్రామపంచాయతీ లకు ఆదాయం లభించే మార్గాలను ఎంచుకోవాలని, పన్నుల వసూళ్ల పూర్తి చేయాలని, తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవోలు రహీం, సాల్మన్‌రాజ్, పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు.

సంక్షిప్త సమాచారం


లింబా (బీ)లో ఒకరి ఆత్మహత్య



యోగేష్ మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్సై

కుంటాల, మే, 3 : మండలంలోని లింబా (బీ) గ్రామానికి చెందిన గంగుల యోగేష్ (22) అనే యువకుడు శుక్రవారం ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డట్లు ఎస్సై రజనీకాంత్ తెలిపారు. పోలీసులు, కుటుంబీకుల కథనం మేరకు యోగేష్ ఆర్థిక కారణాల వల్ల ఇంట్లో ఎవరికి చెప్పకుండా బయటకు వెళ్లి ఆత్మహత్యకు పాల్పడ్డట్లు తెలిపారు. మృతుడి తండ్రి నారాయణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

మద్యం పట్టివేత



ఎర్వచింతల్‌లో పట్టుకున్న మద్యంతో పోలీసులు

ఖానాపూర్, మే 3 : మండలంలోని ఎర్వచింతల్ గ్రామంలో అక్రమంగా నిర్వహిస్తున్న బెల్ట్‌షాప్‌పై పోలీసులు దాడులు నిర్వహించినట్లు ఎస్సై లింబాద్రి తెలి పారు. ఈ దాడుల్లో ఐదు కాటన్ల బీర్లు, 60 క్వార్టర్ల మద్యం పట్టుకున్నట్లు పేర్కొన్నారు. పోలీసులు పట్టుకున్న మద్యం విలువ సుమారు రూ. 22,850 ఉంటుందని ఎస్సై పేర్కొన్నారు. బెల్ట్‌షాప్ యజమానిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

బీఆర్ఎస్ సభను విజయవంతం చేయండి

కుభీర్, మే 3 : మండల కేంద్రం కుభీర్‌లోని బాలాజీ జిన్నింగ్ ఫ్యాక్టరీలో శనివారం జరుగనున్న బీఆర్ఎస్ పార్టీ సభను విజయవంతం చేయాలని మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు ఎన్నిల అనీల్ అన్నారు. శుక్రవారం పార్టీ నాయకులు, కార్యకర్తలతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ గంగాచరణ్, వైస్ ఎంపీపీ మోహియొద్దీన్, మండల సోషల్ మీడియా కన్వీనర్ గడ్డం సంజీవ్, నాయకులు పాల్గొన్నారు.

మాజీ మంత్రిని కలిసిన భాగ్యనగర్ మున్నూరుకాపు సంఘం అధ్యక్షుడు

నిర్మల్ చైన్‌గేట్, మే 3 : కాంగ్రెస్ పార్టీలో చేరిన మాజీ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డిని భాగ్యనగర్ మున్నూరు కాపు సంఘం అధ్యక్షుడు కూన పెద్ద లింగన్న కలిసి శుభాకాంక్షలు తెలిపారు

కత్తులు కలుస్తాయా?





● ఒకే రోజు రెండు సమావేశాలు ● మాజీ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి చేరికల మీటింగ్‌కు శ్రీహరిరావు దుమ్మా ● పార్టీ ముఖ్యనేతలతో రాహుల్‌గాంధీ పర్యటనపై సమీక్ష ● రెండు కార్యక్రమాలకు హాజరైన మంత్రి సీతక్క ● మంత్రి చొరవతో శ్రీహరిరావు ఇంటికి వెళ్లిన మాజీ మంత్రి అల్లోల ● ఆసక్తికరంగా నిర్మల్ కాంగ్రెస్ రాజకీయం



శుక్రవారం రాత్రి నిర్మల్ జిల్లా కేంద్రంలో మారుతి ఇన్ హోటల్‌లో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న సీతక్క, మాట్లాడుతున్న డీసీసీ అధ్యక్షుడు శ్రీహరిరావు

నిర్మల్, మే 3 (ఆంధ్రజ్యోతి) : నిన్నటి దాక ఉప్పునిప్పుగా ఉన్న జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు శ్రీహరిరావు, మాజీ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి తాజాగా ఒకే పార్టీలో రాజకీయం చేసేందుకు సమాయత్తమవుతున్న నేపథ్యంలో రెండు కత్తులు కలుస్తాయా అన్న సంశయం కాంగ్రెస్ పార్టీ శ్రేణుల్లో నెలకొంది. రాజకీయంగా వీరిద్దరినీ గురుశిష్యులుగా నిర్మల్ నియోజకవర్గంలో రాజకీయ విశ్లేషకులు అభివర్ణిస్తుంటారు. గతంలో భారతీయ రాష్ట్ర సమితి పార్టీలోనూ ఇలాంటి సన్నివేశమే ఒకసారి జరగగా.... ఆ స్నేహం బలపడలేదు. మళ్లీ తాజాగా అలాంటి సన్నివేశమే తెరకెక్కుతున్నది. ఈ సారి కాంగ్రెస్ పార్టీలో ఈ పరిణామం చోటు చేసుకోగా ఈ సారైనా కలిసి నడుస్తారా ...? కత్తులు దూస్తారా...? అన్నదీ పార్టీ వర్గాల్లో చర్చకు దారి తీస్తున్నది.

మాజీ మంత్రి చేరికల మీటింగ్‌కు డుమ్మా

గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో పదేళ్ల మంత్రిగా ఉండి ఆ పార్టీకి రాజీనామా చేసిన ఇంద్రకరణ్‌రెడ్డి తాజాగా దీపాదాస్ మున్షి, సీఎం రేవంత్ రెడ్డిల సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఆయన కాంగ్రెస్ పార్టీలో చేరడాన్ని డీసీసీ అధ్యక్షులు శ్రీహరిరావు తీవ్రంగా వ్యతిరేకించారు. ఒక దశలో ఆయన కాంగ్రెస్ పార్టీలో చేరడం కష్టమే అనుకున్నా.... చివరి క్షణంలో పార్టీ అధిష్టానం ఆయన చేరికకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. కాంగ్రెస్‌లో చేరిన ఇంద్రకరణ్‌రెడ్డి శుక్రవారం సాయంత్రం నిర్మల్‌లో భారీ ఎత్తున బీఆర్ఎస్ కార్యకర్తలను కాంగ్రెస్ పార్టీలో చేర్పించే కార్యక్రమాన్ని నిర్వహించారు. రెడ్డి ఫంక్షన్‌హాల్‌లో జరిగిన ఈ కార్యక్రమానికి మంత్రి సీతక్క హాజరయ్యారు. జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు శ్రీహరిరావు మాత్రం దూరంగా ఉన్నారు. ఇదీ అల్లోల పార్టీలో చేరిన తొలిరోజే కొత్త చర్చకు దారి తీసింది. శ్రీహరిరావు సహా ఆయన అనుచరులు ఎవరు కూడా ఇంద్రకరణ్‌రెడ్డి నిర్వహించిన సమావేశానికి వెళ్లలేదు.



రెడ్డి ఫంక్షన్‌హాల్‌లో మాజీ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి హాజరైన సీతక్క

రాహుల్ పర్యటనపై శ్రీహరిరావు సమీక్ష... సీతక్క హాజరు

ఇంద్రకరణ్‌రెడ్డి నిర్వహించిన పార్టీ చేరికల కార్యక్రమం జరుగుతుండగానే మరోవైపు నిర్మల్‌లోనే డీసీసీ అధ్యక్షులు శ్రీహరిరావు మారుతి హోటల్‌లో మరో కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. పార్టీ ముఖ్య నేతలు, కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ, సీఎం రేవంత్‌రెడ్డి ఈ నెల 5వ తేదీన నిర్మల్ వస్తున్నందున ఆ కార్యక్రమాన్ని విజయవంతం చేసే అంశంపై శ్రీహరిరావు సమీక్ష సమావేశం ఏర్పాటు చేశారు. ఇంద్రకరణ్‌రెడ్డి చేరికల కార్యక్రమాన్ని ముగించుకున్న వెంటనే మంత్రి సీతక్క నేరుగా శ్రీహరిరావు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి వెళ్లారు. రెండు చోట్ల కూడా పాత, కొత్త నేతలు కలిసి పనిచేయాలని ఆమె సూచించారు. తాజా పరిణామాలు కాంగ్రెస్ పార్టీ వర్గాల్లో ఆసక్తి రేపుతున్నాయి.

మంత్రి చొరవతో శ్రీహరిరావు ఇంటికి అల్లోల

ఇదిలా ఉండగా ఇటీవలనే కాంగ్రెస్ పార్టీలో చేరిన మాజీ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి శుక్రవారం రాత్రి డీసీసీ అధ్యక్షులు శ్రీహరిరావు నివాసానికి వెళ్లారు. ఆయన నివాసంలో మంత్రి సీతక్క సమక్షంలో శ్రీహరిరావుతో భేటీ అయ్యారు. పార్టీలో కలిసి పనిచేసే అంశంతో పాటు విభేదాలు పక్కన పెట్టి ఎంపీ అభ్యర్థి గెలుపు కోసం పని చేసే విషయాలపై మాట్లాడినట్లు సమాచారం. ఇద్దరు నేతలు మనస్పర్థలు వీడి ఎంపీ గెలుపు కోసం పనిచేయాలని సీతక్క ఈ సందర్భంగా సూచించారు. అయితే రాజకీయంగా ఒకే పార్టీలో కొనసాగుతున్న ఇద్దరు నేతలు తమ ముఖ్య అనుచరులు, కార్యకర్తలను ఎవరికి వారుగా మేనేజ్ చేస్తుండగా తాజాగా జరుగుతున్న పరిణామాలు ఆసక్తిని రేపుతున్నాయి. ఇద్దరు నేతలు కలిసి పని చేస్తారా కత్తులు దూస్తారా అన్నది వేచి చూడాలి.



డీసీసీ అధ్యక్షులు శ్రీహరిరావు ఇంట్లో సమావేశమైన మంత్రి సీతక్క, మాజీ మంత్రి అల్లోల, డీసీసీ అధ్యక్షులు శ్రీహరిరావు

రారెత్తిస్తున్న ఎండలు

● ఆదిలాబాద్ జిల్లా నేరడిగొండలో 43.8 డిగ్రీల అత్యధిక పగటి ఉష్ణోగ్రత నమోదు



ఆదిలాబాద్‌లో నిర్మానుష్యంగా మారిన ప్రధాన రహదారి

ఆదిలాబాద్, మే 3(ఆంధ్రజ్యోతి): ఆదిలాబాద్ జిల్లాలో రారెత్తిస్తున్న ఎండలతో జనం ఉక్కిరిబిక్కిరవుతున్నారు. పగలంతా వడగాలుల ప్రభావం, రాత్రిళ్లు తీవ్రమైన ఉక్కపోత కనిపిస్తుంది. మే మాసం మొదలు కావడంతో మండెఎండలు నిప్పులు కురిపిస్తున్నాయి. ఎండల దాటికి పగలంతా జనం బయటకు వచ్చేందుకు జంకుతున్నారు. ఉదయం సాయంత్రం వేళల్లోనే పనులు ముగించుకుని ఇళ్లలోకి వెళ్లిపోతున్నారు. అంతేకాకుండా పగలంతా ఎండల తీవ్రత నుంచి ఉపశమనం పొందేందుకు ఏసీలు, ఫ్రిజ్‌లను ఏర్పాటు చేసుకుంటున్నారు. దీంతో కరెంట్ మీటర్లు గిర్రున తిరగడంతో విద్యుత్ బిల్లులు రెండింతలుగా పెరిగి పోతున్నాయన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. శుక్రవారం ఆదిలాబాద్ జిల్లా సగటు గరిష్ట ఉష్ణోగ్రత 43.0 కనిష్ట ఉష్ణోగ్రత 20.2 డిగ్రీలుగా నమోదు కాగా అత్యధికంగా నేరడిగొండ మండలంలో 43.8, మావల మండలంలో 43.2, ఆదిలాబాద్ అర్బన్‌లో 43.1, తలమడుగులో 42.1, జైనథ్‌లో 42.5, ఇంద్రవెల్లిలో 41.8 గాదిగూడలో 42.8 గరిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. కేవలం బజార్‌హత్నూర్ మండలంలోనే 39.9 ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఎండల తీవ్రతకు గొడ్డు, గోదా అల్లాడుతున్నాయి. పశు గ్రాసం మంచినీటి గోస తప్పడం లేదు. గ్రామాల్లో భూగర్భ జలాలు పాతాలానికి పడిపోవడంతో వ్యవసాయ బావులు అడుగంటుతున్నాయి. ఇప్పటికే పలురకాల పంటలు కూడా ఎండుముఖం పడుతున్నాయి. దీంతో పంటలను కాపాడుకునేందుకు రైతులు భగీరథ ప్రయత్నం చేస్తున్న ప్రయోజనం లేదంటున్నారు.

మతోన్మాద బీజేపీని, మిత్రపక్షాలను ఓడించండి

● సీపీఐ(ఎంఎల్) న్యూ డెమోక్రసీ జిల్లా కార్యదర్శి



మాట్లాడుతున్న నంది రామయ్య

ఉట్నూర్, మే 3: పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ, అనుబంధంగా ఉన్న మతోన్మాద మిత్రపక్షాలను ఓడించాలని సీపీఐ(ఎంఎల్) న్యూ డెమోక్రసీ జిల్లా కార్యదర్శి నందిరామయ్య పిలుపునిచ్చారు. శుక్రవారం ఉట్నూర్ మండలకేంద్రంలోని రాంజీగోండు భవన్‌లో సీపీఐ(ఎంఎల్), మాస్‌లైన్ (ప్రజా పంథా) పార్టీ ఉట్నూర్ కార్యాలయంలో జరిగిన (ప్రజాపంథా) ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా సర్వసభ్య సమావేశంలో జిల్లా కార్యదర్శి నంది రామయ్య పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న 18వ లోక్‌సభ ఎన్నికలు అత్యంత కీలకమైనవని, అత్యంత సంక్లిష్ట పరిస్థితులలో జరుగుతున్నాయని, గత 70ఏళ్లుగా జరిగిన సాధారణ ఎన్నికలు కావని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్(ప్రజాపంథా) భావిస్తున్నదన్నారు. ఈ ఎన్నికలు భారత ప్రజల ప్రజాస్వామిక వాంఛలకు ప్రతిబింబంగా మారాలని భావిస్తున్నదన్నారు. ఈ ఎన్నికలలో ఫాసిస్టు బీజేపీని, ఆర్ఎస్ఎస్ కూటమిని, ప్రజాస్వామిక, లౌకిక, వామపక్ష, ప్రజాశక్తులంతా కలిసి ఓడించాలని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్(ప్రజాపంథా) దేశ ప్రజలకు పిలుపునిస్తున్నది. జర్మని ఫాసిస్టు నియంత హిట్లర్ అడుగుజాడలలో బీజేపీ ప్రభుత్వం నడుస్తున్నది. ఇండియా కూటమిలో ఆదిలాబాద్ పార్లమెంటరీ అభ్యర్థి ఆదివాసీ ఆత్రం సుగుణకి సీపీఐఎంఎల్ మాస్‌లైన్ ప్రజాపంథా మద్ధతునిస్తున్నదన్నారు. రానున్న ఎన్నికలలో సీపీఐఎంఎల్ ప్రజాపంథా కార్యకర్తలు, శ్రేణులు బీజేపీ వ్యతిరేక ప్రచారంలో క్రియాశీలకంగా పాల్గొనాలని కోరారు. ఇందులో జగన్‌సింగ్, అజ్మీర వినోద్ కుమార్, కుమ్రఅశోక్, వాఘ్మారే ప్రజ్ఞశీల్, కొడుపసురేష్, మడావి రేణుక, బుచ్చిరాం, త్రిచరణ్, తదితరులు పాల్గొన్నారు.

పదేళ్ల బీజేపీ పాలనలో రాష్ట్రానికి ఒరిగిందేమీ లేదు

● మత విద్వేషాలు రెచ్చగొట్టి రాజకీయాలు చేస్తున్న బీజేపీకి గుణపాఠం చెప్పాలి ● తెలంగాణ ఇచ్చిన పార్టీగా కాంగ్రెస్‌ను గెలిపిద్దాం
● జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క ● పెద్దసంఖ్యలో హస్తం పార్టీ కండువా కప్పుకున్న మాజీ మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి అనుచరులు



కార్యక్రమంలో మాట్లాడుతున్న మంత్రి సీతక్క



ఉపాధి హామీ కూలీలతో మాట్లాడుతున్న మంత్రి సీతక్క

నిర్మల్, మే 3 (ఆంధ్రజ్యోతి) : గత పదేళ్ల బీజేపీ పాలనలో ప్రజలకు ఒరిగిందేమీ లేదని ముఖ్యంగా తెలంగాణ రాష్ట్రానికి ఒక్క ప్రాజెక్టు కూడా రాలేదని జిల్లా ఇన్‌చార్జి మంత్రి ధనసరి అనసూయ సీతక్క అన్నారు. శుక్రవారం సాయంత్రం స్థానికరెడ్డి ఫంక్షన్‌హాల్‌లో మాజీ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి అనుచరులు పెద్దసంఖ్యలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. పార్టీలో చేరిన వారికి మంత్రి సీతక్క హస్తం పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... మాజీ మంత్రి ఇంద్రకరణ్ రెడ్డితో పాటు నియోజకవర్గంలోని ఆయన అనుచరులంతా సొంత ఇంటికి తిరిగి వచ్చినందుకు స్వాగతం పలుకుతున్నట్లు తెలిపారు. ప్రస్తుత పరిస్థితుల్లో కాంగ్రెస్ పార్టీ దేశంలో అధికారంలోకి రావడం చారిత్రక అంశం అన్నారు. గత పదేళ్ల బీజేపీ పాలనలో అయోధ్య గుడి తప్ప తెలంగాణలో ఒక్క గుడి కట్టింది లేదన్నారు. అది కూడా ప్రజల సొమ్ముతో కట్టిన గుడి అని, కేవలం రాజకీయ ప్రయోజనాల కోసమే ఆలయం పేరు చెబుతూ ఓట్లను దండుకునేందుకు యత్నిస్తున్నదని విమర్శించారు. ఈ దేశ ప్రజలకు అక్షింతలు మాత్రమే ఇచ్చి, అభివృద్ధిని మరిచారని మండిపడ్డారు. ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలను కల్పిస్తామని చెప్పారని, ఈ లెక్కన ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు 10 లక్షల ఉద్యోగాలు రావాలన్నారు. ఇప్పటి వరకు ఎన్ని ఉద్యోగాలు కల్పించారో ప్రజలందరికీ తెలుసు అన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఆరు గ్యారంటీల అమలును దశల వారీగా చేస్తున్నదని త్వరలోనే రెండు లక్షల రుణమాఫీ కూడా చేయనున్నట్లు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ హయాంలోనే ఇక్కడి ఎస్సారెస్పీ, కడెం, స్వర్ణ, సాత్నాల వంటి ప్రాజెక్టుల నిర్మాణం జరిగిందన్నారు. సాగునీటి ప్రాజెక్టులే ఆధునిక దేవాలయాలుగా కాంగ్రెస్ పార్టీ భావిస్తున్నదని, కానీ బీజేపీ మాత్రం ప్రజల మధ్య చిచ్చు పెట్టి మత విద్వేషాలు రెచ్చగొట్టి ఓట్లను కొల్లగొట్టేందుకు యత్నిస్తోందని మండిపడ్డారు. గాంధీని చంపిన గాడ్సేల పార్టీ, గాంధీ సిద్ధాంతాలను రూపుమాపాలని చూస్తున్న బీజేపీని ఈ ఎన్నికల్లో చిత్తుగా ఓడించాలని పిలుపునిచ్చారు. భారత రాజ్యాంగం ప్రమాదంలో పడుతోందని, గాంధీ సిద్ధాంతాలను విచ్ఛిన్నం చేస్తుందని బీజేపీపై ఆమె మండిపడ్డారు. దేశ పౌరుల హక్కులను కాపాడే చట్టాలు ఈ రాజ్యాంగంలో ఉన్నాయని, దాన్ని రూపుమాపి మళ్లీ వందల ఏళ్ల బానిసత్వాన్ని తీసుకొచ్చేందుకు బీఆర్ఎస్, బీజేపీలు కుట్ర పన్నుతున్నాయని ఆరోపించారు. పేదలకు 100 రోజుల ఉపాధి కల్పించిన పార్టీగా, గిరిజనులకు పోడు భూములకు పట్టాలు ఇచ్చిన పార్టీగా, తెలంగాణ ఇచ్చిన పార్టీగా కాంగ్రెస్ పార్టీని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని ఈ సందర్భంగా పార్టీ శ్రేణులకు ఆమె విజ్ఞప్తి చేశారు. 70 ఏళ్ల తర్వాత ఒక మహిళకు అవకాశం వచ్చిందని, పేదింటి బిడ్డగా హక్కుల కోసం పోరాడే మహిళగా, ఎంతో మంచి పేరున్న ఆత్రం సుగుణను గెలిపించేందుకు ప్రతి ఒక్కరూ పాటుపడాలన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ ఎన్నికల కోఆర్డినేటర్ శ్రావణ్ రెడ్డి, మాజీ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పార్లమెంట్ ఎన్నికల్లో కష్టపడి పని చేయాలి

నిర్మల్ అర్బన్ : పార్లమెంట్ ఎన్నికలకు మరో పది రోజుల గడువు ఉందని ప్రతీ కార్యకర్త కష్టపడి పనిచేసి, ఆదివాసీ ముద్దుబిడ్డ ఆత్రం సుగుణను పార్లమెంట్ ఎన్నికల్లో భారీ మెజార్టీతో గెలిపించాలని ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క అన్నారు. జిల్లా కేంద్రంలోని హోటల్ మారుతిలో డీసీసీ అధ్యక్షులు శ్రీహరిరావు అధ్యక్షతన శుక్రవారం నిర్మల్ నియోజకవర్గ ప్రజాప్రతినిధులు, నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... సీఎం రేవంత్‌రెడ్డి మొదటిసారిగా ఆదివాసీ ముద్దుబిడ్డ ఆత్రం సుగుణకు పార్లమెంట్ ఎన్నికల్లో పోటీ చేసేందుకు అవకాశం ఇచ్చారన్నారు. ప్రతి గ్రామం నుంచి భారీ మెజార్టీ వచ్చిన నాయకులు కష్టపడి పని చేయాలని కోరారు. మహిళా అభ్యర్థిని పార్లమెంట్‌కు పంపిస్తే ఉమ్మడి జిల్లా ఎంతో అభివృద్ధి జరుగుతుందని తెలిపారు. నిర్మల్ నియోజకవర్గం నుంచి భారీ మెజార్టీ ఇచ్చినట్లయితే శ్రీహరి రావు మరిన్ని నిధులు తీసుకొచ్చి అభివృద్ధి చేస్తారని పేర్కొన్నారు. ఇంటింటికి వెళ్లి కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ మతతత్వ విధానాలు వివరించాలన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం గత పదేళ్ల కాలంలో రాష్ట్రానికి చేసింది ఏమీ లేదని, అలాంటి పార్టీని నమ్మవద్దని కోరారు. రాష్ట్రంలో మెజార్టీ ఎంపీ స్థానాలు గెలిచి రాహుల్‌గాంధీని ప్రధాన మంత్రి చేద్దామని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో కేంద్ర మాజీ మంత్రి సముద్రాల వేణుగోపాలచారి, టీపీసీసీ కార్యదర్శి శ్రావణ్‌కుమార్‌రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ అప్పాల గణేష్ చక్రవర్తి, ఏఐసీసీ కార్యదర్శి నరేష్‌జాదవ్, జడ్పీటీసీ పత్తిరెడ్డి రాజేశ్వర్‌రెడ్డి, జాదవ్ సోనియా సంతోష్, ఎంపీపీలు రమేష్, అమృత జైసింగ్, ఆడె సవిత, రామేశ్వర్‌రెడ్డి వివిధ మండలాల అధ్యక్షులు, నాయకులు పాల్గొన్నారు.

సారంగాపూర్ : కాంగ్రెస్ పార్టీతోనే అభివృద్ధి సాధ్యమవుతుందని శిశు సంక్షేమ పంచాయతీ రాజ్ గ్రామీణ అభివృద్ధి శాఖ మంత్రి సీతక్క అన్నారు. మండలంలోని ఆలూర్, చించోలి(ఎం), బీరవెల్లి గ్రామాల్లో పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా పర్యటించి ఉపాధి కూలీలతో సమావేశమై సమావేశంలో సమస్యలను అడిగి తెలుసుకున్నారు. జరగబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోని రాగానే ఉపాధి హామీ కూలీల సమస్యలను వెంటనే పరిష్కారమయ్యేలా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. బీఆర్ఎస్, బీజేపీ పార్టీల నాయకులు ప్రజలను మాయ మాటలతో మోసం చేస్తున్నారే తప్పా అభివృద్ధి చేయడంలో విఫలమయ్యారన్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో గెలుపొందేలా కృషి చేయాలని తెలిపారు. జరగబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గెలుపొందుతారని జోస్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కూచాడి శ్రీహరి రావు, జడ్పీటీసీ పత్తిరెడ్డి రాజేశ్వర్ రెడ్డి, నాయకులు మల్లారెడ్డి, రాజ్ మహ్మద్, శ్రీనివాస్ రెడ్డి, బొల్లోజి నర్సయ్య, లక్ష్మణ్, లింగయ్యలతో పాటు నాయకులు ఉన్నారు.



పార్టీలోకి ఆహ్వానిస్తున్న మంత్రి సీతక్క

మంత్రి సీతక్క సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిక

నిర్మల్ కల్చరల్, మే 3 : నిర్మల్ జిల్లా కేంద్రం భాగ్యనగర్, గొల్లపేట బీఆర్ఎస్ పార్టీకి చెందిన ఖమ్మం సురేందర్, విజయ్‌తో పాటు పెద్ద ఎత్తున శుక్రవారం మంత్రి సీతక్క సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. మాజీ చైర్మన్ అప్పాల గణేష్ ఆధ్వర్యంలో వారంతా పార్టీ కండువా కప్పుకున్నారు. మంత్రి సీతక్క వారిని పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... రాహుల్ గాంధీని ప్రధాన మంత్రిగా చేసేంత వరకు కార్యకర్తలు, నాయకులు కృషి చేయాలన్నారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ పాలనతో విసిగిపోయిన నాయకులు సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో ఏర్పాటైన ప్రజా ప్రభుత్వం కాంగ్రెస్‌లో పెద్ద ఎత్తున చేరుతున్నారన్నారు. పసులోటి మోహన్, వెంకటేష్, కోనేటి మాధవ్, తదితర 50 మంది యూత్ పార్టీలో చేరిన వారిలో ఉన్నారు.

అంబేద్కర్ స్టడీ సెంటర్‌కు స్థలం కేటాయించండి

నిర్మల్ పట్టణంలోని ప్రభుత్వ భూమి సర్వేనెంబర్ 534లో గల భూమిని అంబేద్కర్‌స్టడీ సెంటర్‌కు కేటాయించాలని కోరుతూ శుక్రవారం మంత్రి సీతక్కకు అంబేద్కర్ సంఘ నాయకులు వినతి పత్రం అందజేశారు. బత్తుల రంజిత్, గణేష్, రవి, నవీన్, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సఖీ సెంటర్ నిర్వాహకురాలు సరస్వతి

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం

● సఖీ సెంటర్ నిర్వాహకురాలు సరస్వతి

తలమడుగు, మే 3: బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని సఖీ సెంటర్ నిర్వాహకురాలు సరస్వతి అన్నారు. శుక్రవారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో మండలకేంద్రంలోని అంగన్‌వాడీ సెంటర్-2లో బాల్య వివాహాల నిర్మూలన కార్యక్రమం మండలస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ అవగాహన కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపవైజర్ విజయ సఖీ కేంద్రం నిర్వాహకురాలు సరస్వతి మాట్లాడుతూ నేషనల్ కమిషన్ ఫర్ ప్రొటెక్షన్ ఆఫ్ చైల్డ్‌రైట్స్ వారి ఆదేశాల మేరకు మే10 అక్షయ తృతీయ రోజును పురస్కరించుకుని గ్రామస్థాయిలో ఎక్కువగా బాల్య వివాహాలు జరిగే అస్కారం ఉందని బాల్య వివాహాలను అరికట్టే దిశగా అవగాహన కార్యక్రమం నిర్వహించామన్నారు. 18 సంవత్సరాలు నిండిన అమ్మాయిలకు 21 సంవత్సరాలు నిండిన అబ్బాయిలకు మాత్రమే వివాహం చేయాలని బాల్య వివాహాలు చేయడం వల్ల మానసిక, శారీరక ధృడత్వం లేక జరిగే నష్టాలను వివరించారు. బాల్య వివాహాలు జరిపించిన నిర్వహించిన వారికి బాల్య వివాహాల నిరోధక చట్టం 2006 ప్రకారం రెండు సంవత్సరాలు జైలుశిక్ష, ఒక లక్ష రూపాయలు జరిమానా విధించబడాతాయని తెలిపారు.బాల్యవివాహం జరుగుతుందని సమాచారం రాగానే అన్ని శాఖల అధికారులు తమ పరిధిలో బాల్య వివాహం ఆపే ప్రయత్నం చేయాలని, ప్రతిఒక్కరు తమవంతు సహాయంగా స్పందించి 1098, 181 అండ్ డయల్ వంద సమాచారం తెలియజేయాలని, అదేవిధంగా సఖీ కేంద్రం అదించే ఐదు రకాల సేవలు గురించి వివరించారు. ఇందులో పంచాయతీ సెక్రటరీ అశోక్, అంగన్‌వాడీ టీచర్లు పద్మ, మంజుల, రమణ, ప్రైమరీ హెల్త్ సెంటర్ పబ్లిక్ హెల్త్ నర్స్ నిర్మల, గ్రామ ప్రజలు కిశోరా బాలికలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

మాదిగలను మోసం చేసిన కాంగ్రెస్

● మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి రాష్ట్ర కార్యదర్శి

ఇంద్రవెల్లి, మే 3: తెలంగాణలో మూడు ఎస్సీ పార్లమెంట్ స్థానాల్లో మాదిగలకు కాంగ్రెస్ ఒక్క ఎంపీ స్థానం కూడా ఇవ్వకుండా మోసం చేసిందని మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి రాష్ట్ర కార్యదర్శి కాంబ్లే బాలాజీ మాదిగ విమర్శించారు. శుక్రవారం మండల కేంద్రంలోని స్థానిక ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో ఎంపీలకు మూడు రిజర్వు సీట్లు ఉంటే రాష్ట్రంలో అత్యధిక జనాభా కలిగిన మాదిగలకు ఒక్క సీటు కూడా ఇవ్వకుండా రేవంత్‌రెడ్డి మాదిగలను మోసం చేశారని విమర్శించారు.మాదిగలంతా ఏకమై పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి తగిన గుణపాఠం చెప్పాలన్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్‌లు మాదిగలను అన్ని విధాలుగా మోసం చేస్తూ వచ్చాయని, మాదిగలకు న్యాయం జరగాలంటే బీజేపీ పట్టం కట్టాలని, బీజేపీఎంపీ అభ్యర్థి గోడం నగేష్‌ను భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీని గెలిపించుకోవాల్సిన బాధ్యత మాదిగల అందరిపై ఉందన్నారు నేడు హైదరాబాద్‌లో జరిగే మాదిగల మహాధర్నాను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి జిల్లా అధికార ప్రతినిధి నాతరి రాజు మాదిగ, జిల్లా కార్యదర్శి దాసరి రాంప్రసాద్ మాదిగ, మండల ఇన్‌చార్జీ విక్రమ్ మాదిగ, సూర్యవంశీ, సాయి మాదిగ, సూర్యవంశీ, మాధవ్ మాదిగ, తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

ఇచ్చోడ, మే3: మండలంలోని ఎల్లమ్మగూడ గ్రామానికి చెందిన షేక్ మాలిక్(18) అనే యువకుడు బంధువుల పెళ్లి నిమిత్తం ఎల్లమ్మగూడ గ్రామం నుంచి ఇచ్చోడకు వచ్చే దారిలో మార్గమధ్యంలో గురువారం మధ్యాహ్నం మేడిగూడ గ్రామ సమీపంలో రోడ్డుపై ఎదురుగా వస్తున్న కారు (టీఎస్01ఈఏ2772) ఢీకొట్టగా.. మాలిక్‌కు తీవ్ర గాయాలయ్యాయి. దీంతో గమనించిన స్థానికులు 108 అంబులెన్స్‌లో ఇచ్చోడ పీహెచ్‌సీకి తరలించారు. దీంతో పరిస్థితి విషమయంగా ఉండడంతో ఆదిలాబాద్ రిమ్స్‌కు తరలించారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం నిజామాబాద్‌లోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతు రాత్రి మృతిచెందారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నరేష్ తెలిపారు.

ముగ్గురి అదృశ్యం

మావల, మే 3: మావల పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఇద్దరూ వివాహితలు ఓ యువకుడు వేర్వేరుగా అదృశ్యమైనట్లు మావల ఎస్సై విష్ణువర్ధన్ తెలిపారు. దీనికి సంబంధంచి శుక్రవారం ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. కేఆర్కే కాలనీకి చెందిన వివా హిత(24) అదృశ్యమైనట్లు తెలిపారు. భర్త ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు. అదేవిధంగా పట్టణంలోని సాయినగర్‌కు చెందిన యువకుడు నిశాంత్(23) కూలి పనులు చేస్తుంటాడు. పనికి వెళ్లి తిరిగి ఇంటికి రాకపోవడంతో తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని తెలిపారు. అదే కాలనీకి చెందిన మరో వివాహిత(23) భర్తకు దూరంగా ఉంటూ తండ్రి వద్ద ఉంటుంది. ఈ క్రమంలో బయటకి వెళ్లి వస్తానని చెప్పి తిరిగి రాకపోవడంతో తండ్రి ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.



ఆదిలాబాద్ రిమ్స్‌లో తండ్రికి వైద్యం చేయిస్తున్న ఖానాపూర్ ఎమ్మెల్యే

ప్రభుత్వ ఆసుపత్రిలో ఖానాపూర్ ఎమ్మెల్యే తండ్రికి శస్త్రచికిత్స

ఉట్నూర్, మే 3: సర్కారీ దవాఖానాలే పేదలకు నాణ్యమైన వైద్యం అందిస్తాయని ప్రజల్లో నమ్మకం కలిగించి ప్రజల దృష్టిని సర్కారు దవాఖానాల వైపు మళ్లించడంలో ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మబొజ్జు పటేల్ ముందు వరుసలో ఉన్నారు. తనకు జబ్బు చేస్తే స్వయంగా సర్కారు దవాఖానాకు వెళ్లి వైద్యం చేయించుకునే ఎమ్మెల్యే వెడ్మబొజ్జుపటేల్ తన తండ్రిని కూడా సర్కారు ఆసుపత్రిలో చేర్పించి తన నిబద్ధతను చాటుకున్నారు. ఎమ్మెల్యే వెడ్మబొజ్జు తండ్రి వెడ్మభీంరావు దవడకు క్యాన్సర్ అయింది. ఈ విషయం తెలుసుకున్న ఆయ ధైర్యంగా తన తండ్రిని ఆదిలాబాద్‌లోని రిమ్స్ సూపర్ స్పెషాలిటి ఆసుపత్రిలో చేర్పించారు. డాక్టర్లతో మాట్లాడి డాక్టర్లు ఇచ్చిన ధైర్యంతో అక్కడే శస్త్ర చికిత్స చేయించారు. అంకలాజి డాక్టర్లు విజయవంతంగా ఆపరేసన్ చేశారు. ఎమ్మెల్యే తండ్రి ప్రస్థుతం కోలుకుంటున్నారు. శుక్రవారం ఎమ్మెల్యే ఆసుపత్రికి వెళ్లి తండ్రిని పరామర్శించి సపర్యాలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్కారు ఆసుపత్రులపై ప్రజలకు నమ్మకం కలిగించేందుకు తన తండ్రికి సర్కారు ఆసుపత్రిలో శస్త్ర చికిత్స చేయించానని అన్నారు. చిన్న చిన్న రోగాలకు చికిత్స కోసం కార్పొరేట్ ఆసుపత్రులకు వెళ్లి ఆర్థిక సమస్యలు తెచ్చుకోవద్దని సూచించారు. ప్రభుత్వ ఆసుపత్రులను ఆధునికరించి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు నాణ్యమైన విద్య సదుపాయాలు కల్పిస్తుందని అన్నారు.



తర్లపాడ్‌లో నేరాల నియంత్రణలో సీసీ కెమెరాల పాత్రపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ఎస్సై లింబాద్రి

నేరాల నిర్ధారణలో సీసీ కెమెరాల పాత్ర కీలకం

● ఖానాపూర్ ఎస్సై లింబాద్రి

ఖానాపూర్, మే 3 : నేరాల నిర్ధారణలో సీసీ కెమెరాల పాత్ర కీలకమని ఖానాపూర్ ఎస్సై లింబాద్రి అన్నారు. శుక్రవారం తర్లపాడ్ గ్రామంలో నేరాల నియంత్రణపై ప్రజలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రస్తుత సమాజంలో దొంగలు టెక్నాలజీని వాడి దొంగతనాలకు పాల్పడుతున్నందున వారిని గుర్తించేందుకు పోలీసుశాఖ సైతం ప్రజల్లో చైతన్యాన్ని పెంపొందిస్తుందన్నారు. నేరాలు జరిగిన చోట ఆ నేరాలు నిర్ధారణ చేసి నిందితులను పట్టుకునేందుకు సీసీ కెమెరాలు ఎంతగానో ఉపయోగపడుతున్నాయన్నారు. ఒక ప్రాంతంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తే ఆ ప్రాంతానికి దొంగతనానికి రావాలంటే దొంగలు భయపడతారన్నారు. వ్యాపారస్తులు, గ్రామ పెద్దలు ముందుకు వచ్చి స్వచ్ఛందంగా వారివారి గ్రామాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బందితో పాటు గ్రామస్తులు పెద్ది నర్సయ్య, గుండేటి లక్ష్మీనారాయణ, గాండ్ల శ్రీనివాస్, అంగిరేకుల నగేష్, బాల్యాల మహేందర్, దాదే పవన్, పెద్ది బీరయ్య, పి. చంద్రశేఖర్, నర్సయ్య, శ్రీనివాస్, తదితరులున్నారు.

రోజురోజుకు పెరుగుతున్న ఉష్ణోగ్రతలు

● మండలంలో 45.3 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు



నిర్మానుష్యంగా ఉన్న మండల కేంద్రంలోని ప్రధాన రహదారి

దస్తూరాబాద్, మే 3 : మండలంలో రోజు రోజుకు ఉష్ణోగ్రతలు విపరీతంగా పెరుగుతున్నాయి. మండల కేంద్రంలోని బుట్టాపూర్ గ్రామం లో శుక్రవారం రికార్డుస్థాయిలో ఏకంగా 45.3 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదైనట్లు అధికారులు తెలిపారు. జిల్లాలోనే అత్యధిక ఉష్ణోగ్రతగా నమోదైనట్లు అధికారులు చెబుతున్నారు. ఉష్ణోగ్రత తీవ్రత ఎక్కువగా ఉన్నందున మండల ప్రజలు అత్యవసరం ఉంటే తప్ప ఎండలో బయటకు వెళ్లవద్దని అధికారులు సూచించారు.

ప్రజాస్వామ్యాన్ని ప్రమాదంలోకి నెట్టిన బీజేపీ సర్కార్

● మాజీ కలెక్టర్ ఆకునూరి మురళి



మాట్లాడుతున్న ఆకునూరి మురళి

నిర్మల్ కల్చరల్, మే 3 : కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని ప్రమాదంలోకి నెట్టుతుందని మాజీ కలెక్టర్ ఆకునూరి మురళి అన్నారు. శుక్రవారం తెలంగాణ ప్రజాస్వామిక వేదిక బస్సుయాత్ర నిర్మల్‌కు చేరింది. అంబేద్కర్‌చౌక్ వద్ద జరిగిన సభలో మురళి మాట్లాడుతూ... పదేళ్ల మోదీ పాలన అన్ని వాగ్దానాల అమలులో విఫలమైందన్నారు. ప్రజల మధ్య విద్వేషాలు రెచ్చగొడుతున్న మోదీ పాలనకు ఎన్నికల్లో బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. రాజ్యాంగాన్ని మారుస్తామని, రిజర్వేషన్లు ఎత్తేస్తామని పదేపదే చెబుతున్న మోదీకి తగిన గుణపాఠం చెప్పాలన్నారు. తెలంగాణ నుంచి పన్నుల రూపంలో రూ.12 లక్షల కోట్లు వసూలు చేసి ఇచ్చింది మాత్రం నామమాత్రమేనన్నారు. 16 లక్షల కోట్లను అదానీ, అంబానీలకు దోచి పెట్టారన్నారు. నైనాల గోవర్ధన్ మాట్లాడుతూ... మోదీ దేవుని పేరిట సమాజంలో చిచ్చు రేపుతున్నారన్నారు. శాంతియుత జీవనాన్ని విచ్ఛిన్నం చేస్తున్నారని ఆరోపించారు. ఉద్యోగాలు ఇవ్వలేదని, కులగణన చేపట్టడం లేదని విమర్శించారు. శ్రీనివాస్, ప్రొఫెసర్ లక్ష్మీనారాయణ, పద్మజ, శంకర్, కే. రాజన్న, తదితరులు పాల్గొన్నారు.

ప్రజల సంక్షేమం కోసం ప్రభుత్వ మెడలు వంచుతా

● నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి



వడ్యాల్‌లో ఉపాధి హామీ కూలీలతో మాట్లాడుతున్న మహేశ్వర్‌రెడ్డి

లక్ష్మణచాంద, మే 3 : ప్రజా సంక్షేమం కోసం ప్రభుత్వ మెడలు వంచుతానని నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి శుక్రవారం అన్నారు. బీజేపీతోనే ఈ దేశం అభివృద్ధి చెందుతుందని స్పష్టం చేశారు. లక్ష్మణచాంద మండలంలోని వడ్యాల్, నర్సాపూర్, బాబాపూర్ గ్రామాల్లో ఆదిలాబాద్ పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి గోడం నగేష్‌తో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మరోసారి మోదీని ప్రధాన మంత్రిని చేయటం కోసం మద్దతు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆదిలాబాద్ పార్లమెంట్ అభ్యర్థి గోడం నగేష్, బీజేపీ నాయకులు సత్యానారాయణగౌడ్, రావులరాంనాథ్ తదితరులు ఉన్నారు.

బీజేపీతోనే అభివృద్ధి

సారంగాపూర్, మే 3 : బీజేపీతోనే అభివృద్ధి సాధ్యమని బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంతో పాటు సాయినగర్ గ్రామంలో పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా ఆయన పర్యటించి, ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే నల్ల ఇంద్రకరణ్‌రెడ్డి, నాయకులు నాయకులు, గ్రామస్థులు ఉన్నారు.





కోవర్టులున్నారు.. జాగ్రత్త!

- ప్రధాన పార్టీల్లో ద్వితీయ శ్రేణి నేతలపై అనుమానాలు
- నామినెట్ పదవులను ఆశ చూపుతూ నేతలకు గాలం
- కాంగ్రెస్‌లోకి కొనసాగుతున్న వలసల పరంపర
- నమ్మకమైన నేతలకే ఎన్నికల బాధ్యతలను అప్పగిస్తున్న పార్టీలు
- జిల్లాలో లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో రోజురోజుకూ మారతున్న రాజకీయ సమీకరణలు

ఆదిలాబాద్, మే 3(ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల వేల ప్రధాన పార్టీలను కోవర్టుల భయం వెంటాడుతోంది. ఎన్నికల్లో ఎత్తులకు పైఎత్తులు వేయడం, గెలిచేందుకు నేతలు వ్యూహరచనలు చేస్తున్నారు. కానీ కోవర్టుల గుబులుతో బహిరంగంగా ఎలాంటి నిర్ణయం తీసుకునే పరిస్థితి కనిపించడం లేదంటున్నారు. అధికార కాంగ్రెస్ పార్టీ ఆపరేషన్ ఆకర్ష్‌తో మరింత దూకుడు పెంచడంతో జిల్లాలో వేగంగా రాజకీయ సమీకరణలు మారి పోతున్నాయి. విపక్ష పార్టీలను దెబ్బతీసేందుకు కాంగ్రెస్ ఎత్తుగడలు వేస్తుంది. లోక్‌సభ స్థానాన్ని మళ్లీ తన ఖాతాల్లో వేసుకునేందుకు బీజేపీ ఉత్సాహంగా కనిపిస్తుంది. గెలుపే లక్ష్యంగా తటస్థంగా ఉన్న నేతలకు గాలం వేస్తూ పార్టీలో చేరేలా ఒత్తిడి పెంచుతున్నారు. కార్యకర్తల మనోభావాలు ఎలా ఉన్న పార్టీలో చేరేందుకు ఆసక్తి ఉన్న నేతలకు కండువా కప్పేస్తున్నారు. ఇలాంటి పరిస్థితులను గమనిస్తున్న కొందరు సీనియర్ నేతలు హెచ్చరించే ప్రయత్నం చేస్తున్న పార్టీలు పట్టించుకున్నట్లే కనిపించడం లేదు. ఆదిలాబాద్ లోక్‌సభ ఎన్నికల్లో త్రిముఖ పోరు కనిపిస్తుంది. ఈ ఎన్నికల్లో గెలువడం మూడు ప్రధాన పార్టీలకు ప్రతిష్టాత్మకంగా మారింది. మరోసారి గెలిచి సత్తా చాటేందుకు బీజేపీ సిదమవుతోంది. అసెంబ్లీ ఎన్నికల్లో ఆశించిన ఫలితాలు రాకపోయినా.. లోక్‌సభ ఎన్నికల్లో విజయం సాధించేందుకు కాంగ్రెస్ ఆరాట పడుతోంది. బీఆర్ఎస్ పార్టీ సైతం గట్టి పోటీనిచ్చేందుకు సమయత్తమవుతోంది. ఇలా ప్రధాన పార్టీల మధ్యనే హోరాహోరీ పోరు కనిపిస్తుంది. ఎన్నికలు దగ్గర పడుతున్న కొద్ది అధికార పార్టీ ఆపరేషన్ ఆకర్ష్‌తో వ్యూహాలకు మరింత పదును పెడుతుంది. కోవర్టులున్నారు జాగ్రత్త అంటూ.. పార్టీ అగ్రనేతలు అభ్యర్థులను పదే పదే హెచ్చరిస్తున్నారు.

అభ్యర్థులకు కొత్త టెన్షన్


పార్టీలో కొత్తగా చేరిన నేతల పైననే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇన్నాళ్లు ఓ పార్టీలో కొనసాగి ఎన్నికల ముందే మరో పార్టీలో చేరడంతో ఇంకా పాత సంబంధాలు కొనసాగుతున్నాయి. నిన్నా మొన్నటి వరకు జై అన్న నేతలే నేడు పార్టీ కోసం పని చేసేందుకు నై అనడంతో పలువురు ద్వితీయ శ్రేణి నేతలను పక్కన పెడుతు అభ్యర్థులు ప్రత్యేక దృష్టిని సారిస్తున్నారు. దీంతో అధికార పార్టీలోకి జంప్ చేసేందుకు పలువురు నేతలు ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. తెరవెనుక మంతనాలు జరుపుతు అవకాశం రాగానే కండువాలు మార్చేస్తున్నారు. బోథ్, ఆదిలాబాద్ నియోజక వర్గాలలో నిత్యం ఏదో ఒక చోట చేరికలు ఉండేలా కాంగ్రెస్ నేతలు ప్లాన్ చేస్తున్నారు. పార్టీలోనే కొందరు నేతలు కోవర్టులుగా మారి పోవడంతో అభ్యర్థులకు తలనొప్పిగా మారిందంటున్నారు. పార్టీని వీడి ఇతర పార్టీలోకి చేరుతున్న ద్వితీయ స్థాయి నేతలు పార్టీ వ్యవహారాలు, అభ్యర్థుల సమాచారాన్ని చేరవేయడంతో అభ్యర్థులకు ఇదో కొత్త టెన్షన్‌గా మారిందన్న టాక్ వినిపిస్తుంది.

పదవులతో ఎర

పార్లమెంట్ ఎన్నికల్లో ధన బలం అంతగా కనిపించకపోయినా.. నామినెట్ పదవులు అభివృద్ధిని ఆశచూపుతూ ముఖ్య నేతలకు గాలం వేస్తున్నారు. ఇప్పటి వరకు భర్తీకాని సహాకార సంఘాల చైర్మన్ పదవులు, మార్కెట్ కమిటీలు, దేవాదాయ కమిటీలలో అవకాశం కలిపిస్తామని ఆశ చూపుతూ పార్టీలు బలపడే ప్రయత్నాలు చేస్తున్నాయి. ఇప్పటికే పలువురు ముఖ్యనేతలు ఎంపీటీసీ, సర్పంచ్‌లు కండువాలు మార్చడంతో రాజకీయ పార్టీల అంచనాలు తలకిందులవుతున్నాయి. అలాగే లోక్‌సభ ఎన్నికలు ముగియగానే మొదలయ్యే స్థానిక సంస్థల పదవులతో ఎర వేస్తున్నారు. మొత్తానికి కాంగ్రెస్ వేస్తున్న ఎత్తుగడలకు బీఆర్ఎస్, బీజేపీ పార్టీలు నిస్సాహాయత స్థితిలోనే కనిపిస్తున్నాయి. అంతేకాకుండా ఇలా ఎన్నికల సమయంలో అధికార పార్టీలోకి వలసల పరంపర కొనసాగడంతో రోజురోజుకు బీఆర్ఎస్, బీజేపీ పార్టీలు పూర్తిగా పలుచబడి పోతున్నాయి. స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్లు ఎలా ఉంటాయో కానీ ఇప్పుడు మాత్రం అధికార పార్టీలో చేరేందుకు బీఆర్ఎస్, బీజేపీ పార్టీల నేతలు మొగ్గుచూపుతున్నారు.

నమ్మకమైన నేతలకే బాధ్యతలు

ప్రధాన పార్టీలలో కోవర్టుల సంఖ్య పెరిగిపోవడంతో నేతలు ఆచితూచి అడుగులు వేస్తున్నారు. నమ్మకమైన నేతలకే కీలకమైన ఎన్నికల బాధ్యతలను అప్పగిస్తున్నారు. ఎక్కడ నోరు జారీన సోషల్ మీడియాలో వైరల్ కావడంతో నలుగురు ముందు మాట్లాడేందుకు అభ్యర్థులు జంకుతున్నారు. అదేవిధంగా అత్యంత సన్నిహితంగా ఉండే నేతలతోనే ఎన్నికల్లో వేయాల్సిన ఎత్తుగడల గురించి చర్చిస్తున్నారు. ఒకవేళ అనుమానం వస్తే వారిని పక్కన పెట్టి రహస్యంగా మంతనాలు జరుపుతున్నారు. మొత్తానికి అధికార పార్టీ ఆపరేషన్ ఆకర్ష్‌తో బీఆర్ఎస్ పూర్తిగా డీలాపడిపోగా.. బీజేపీ నేతల్లో ఆందోళన కనిపిస్తోంది. అధికారాన్ని అడ్డు పెట్టుకొని కాంగ్రెస్ బలపడే ప్రయత్నాలు చేస్తోందన్న వాదనలు వినిపిస్తున్నాయి. ప్రజల్లో మంచి పలుకుబడి ఉండి ఎన్నికల అనుభవం ఉన్న నేతలకే పార్టీ ఇన్‌చార్జీ పదవులతో పాటు కీలక బాధ్యతలను అప్పగిస్తున్నారు.





పోలీస్‌స్టేషన్ పరిసరాలను పరిశీలిస్తున్న ఆదిలాబాద్ ఎస్పీ

బోథ్ పోలీస్ స్టేషన్‌ను పరిశీలించిన ఎస్పీ

బోథ్, మే 3: బోథ్ పోలీస్‌స్టేషన్‌ను శుక్రవారం జిల్లా ఎస్పీ గౌస్ ఆలం స్థానిక పోలీస్‌స్టేషన్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన బోథ్ పోలీస్‌స్టేషన్‌లో పరిసరాలను సందర్శించడం జరిగింది. అంతకుముందు పోలీస్ స్టేషన్‌లో నమోదు అవుతున్న కేసుల వివరాలను పరిశీలించి.. స్థానిక ఎస్సై రాము, సీఐ రమేష్‌ను అడిగి తెలుసుకున్నారు. అంతేగాక ఎన్నికల సందర్భంగా వివాదాస్పద గ్రామాలను పరిశీలించాలని శాంతిభద్రతల పరిరక్షణకు ముందుచూపుతో వ్యవహరించాలని సూచించారు. ఎన్నికలకు చేపట్టే చర్యల గురించి పోలీసు అధికారులకు సూచనలు చేశారు.

స్ట్రాంగ్ రూమ్‌ను హోమ్ పోలింగ్ స్టేషన్‌ను పరిశీలించిన కలెక్టర్, ఎస్పీలు


బోథ్: బోథ్ నియోజకవర్గం పరిధిలోని పాట్నాపూర్ గ్రామంలో గురువారం కలెక్టర్ రాజర్షిషాతో పాటు ఎస్పీ గౌస్ అలాంలు హోమ్ పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల్లో 85ఏళ్ల దాటిన వారిక ఎలక్షన్ కమిషన్ ఇంటి వద్దనే ఓటు హక్కును వినియోగించుకునే అవకాశం కల్పించింది. దీంతో గురువారం మండలంలో ఓటు హక్కును వినియోగించుకున్నారు. వీరి వెంట తహసీల్దార్ సుభాష్ చంద్ర, స్థానిక పోలీసు అధికారులు, ఎస్సై బి.రాము, సీఐ రమేష్, తదితరులు ఉన్నారు.

పోలింగ్ సమయం గంట పెంచుతూ.. కేంద్ర ఎన్నికల సంఘం ఉత్తర్వులు

ఆదిలాబాద్ అర్బన్, మే 3: ఈనెల 13న జరుగనున్న పార్లమెంట్ ఎన్నికల్లో పోలింగ్ సమయాన్ని ఒకగంట పెంచుతు కేంద్ర ఎన్నికల సంఘం ఉత్తర్వులు జారీ చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి రాజార్షిషా తెలిపారు. ప్రతీ సాధారణ ఎన్నికల్లో పోలింగ్ సమయం ఉదయం 7గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు ఉండగా ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్నందున పోలింగ్ సయమాన్ని ఈ పార్లమెంట్ ఎన్నికల్లో భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఉదయం 7గంటల నుంచి సాయంత్రం 6గంటల వరకు పెంచుతూ ఉత్తర్వులు జారీ చేసినట్లు తెలిపారు. ఎండల తీవ్రత ఎక్కువగా ఉన్నందు వలన పోలింగ్ సమయం పెంపు వల్ల పోలింగ్ శాతం పెరిగే అవకాశం ఉంటుందని అన్నారు. ఈ అవకాశాన్ని ఆదిలాబాద్ పార్లమెంటరీ నియోజకవర్గంలోని ఏడు సెగ్మెంట్‌లలోని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన ఈ సందర్భంగా కోరారు. ఆదిలాబాద్, బోథ్, నిర్మల్, ముథోల్, ఖానాపూర్‌లలో ఉదయం 7గంటల నుంచి సాయంత్రం 6గంటల వరకు ఆసిఫాబాద్, సిర్పూర్‌లలో ఉదయం 7గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు పోలింగ్ సమయమని కలెక్టర్ తెలిపారు.

బీఆర్ఎస్‌కు మరో బిగ్‌షాక్

- ఎమ్మెల్సీ దండె విఠల్ ఎన్నిక చెల్లదంటూ హైకోర్టు తీర్పు
- సుప్రీం కోర్టును ఆశ్రయించేందుకు సిద్ధమవుతున్న ఎమ్మెల్సీ



ఎమ్మెల్సీ దండె విఠల్

ఆదిలాబాద్, మే 3(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బీఆర్ఎస్‌కు మరో భారీ షాక్ తగిలింది. 2022లో ఆదిలాబాద్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీగా ఎన్నికైన దండె విఠల్ ఎన్నిక చెల్లదంటూ హైకోర్టు సంచలన తీర్పును వెల్లడించింది. అప్పట్లో తన నామినేషన్ ఉప సంహరణ పత్రాలపై ఫోర్జరీ సంతకాలు చేసి ఎన్నికల బరి నుంచి తప్పుకునేలా కుట్ర చేసిన దండె విఠల్‌పై నిర్మల్ జిల్లా సారంగపూర్ జడ్పీటీసీ సభ్యుడు పత్తిరెడ్డి రాజేశ్వర్‌రెడ్డి హైకోర్టును ఆశ్రయించాడు. దీంతో ఆయన పిటిషన్‌ను విచారించిన న్యాయస్థానం ఎమ్మెల్సీ ఎన్నిక చెల్లదంటూ తాజాగా తీర్పునిచ్చింది. ఎన్నికను రద్దు చేయడంతో పాటు రూ.50వేల జరిమానాను కూడా విధించింది. ఇప్పటికే దండే విఠల్ పదవి కాలం రెండేళ్ల పూర్తయ్యింది. మరో నాలుగేళ్ల పాటు పదవి కాలం ఉంది. ఈ తీర్పు పై దండెవిఠల్ సుప్రీంకోర్టును ఆశ్రయించేందుకు సిద్ధమవుతున్నట్లు తెలుస్తుంది. పార్లమెంట్ ఎన్నికలకు ముందు ఆదిలాబాద్ బీఆర్ఎస్‌లో ఊహించని పరిణామాం చోటు చేసుకోవడంతో పార్టీ శ్రేణులు మరింత ఉక్కిరిబిక్కిరవుతున్నారు.

ఫౌజ్‌పూర్ సమీపంలో అంతర్‌రాష్ట్ర రహదారిపై నగదు పట్టివేత

జైనథ్, మే 3: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఎస్ఎంటీ అధికారులు మండల పోలీసు అధికారులు విస్తృత తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా శుక్రవారం మండలంలోని ఫౌజ్‌పూర్ గ్రామంలో సమీపంలోని అంతర్ రాష్ట్ర రహదారిపై ఫ్లయింగ్ స్క్వాడ్ టీం అధికారి ఎఫ్ఎంటీ అధికారి టి.శ్రీనివాస్ వాహనాలను విస్తృతంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పొరుగు రాష్ట్రం మహారాష్ట్ర నుంచి ఆదిలాబాద్ వైపు వస్తున్న ఓ కారును విస్తృతంగా తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా కారులో గల రూ.3లక్షల నగదును స్వాధీనం చేసుకున్నారు. ఈ నగదును జిల్లా గ్రీవెన్స్ ఖాతాలో జమ చేశామని ఎస్ఎఫ్‌టీ టీం అధికారి శ్రీనివాస్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎంటీ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



నగదు వివరాలను వెల్లడిస్తున్న ఎస్ఎఫ్‌టీం అధికారులు

సంక్షిప్త సమాచారం



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న అధికారి, పాల్గొన్న మహిళలు

'బాల్య వివాహాలు చట్టవిరుద్ధం'

ఉట్నూర్, మే 3: బాల్య వివాహాలు జరిపించడం చట్ట విరుద్ధమని, ఎవరైనా బాల్య వివాహాలు జరిపిస్తే కఠిన చర్యలు ఉంటాయని ఉట్నూర్ సమగ్ర బాలాభ్యుదయ అభివృద్ధి సంస్థ ప్రాజెక్టు అధికారి శ్రావణి అన్నారు. శుక్రవారం మండలకేంద్రంలోని ఐటీడీఏ ప్రాంగణంలో ఉన్న సమావేశ మందిరంలో ఉట్నూర్ మండల పరిధిలోని ఐసీడీఎస్ సిబ్బంది ఆధ్వర్యంలో బాల్యవివాహాల అవగాహన సదస్సు నిర్వహించారు. ఎక్కడైనా చిన్న పిల్లలకు వివాహాలు జరిపిస్తే వారికి సూచనలు చేయాలని వినకపోతే 1098కు సమాచారం అందించాలన్నారు. అమ్మాయికి 18, అబ్బాయికి 21ఏళ్ల వయస్సు వచ్చినప్పుడు వివాహాలు జరిపించాలన్నారు. గ్రామీణ ప్రాంతాలలోని ప్రజల్లో అవగాహన లేకపోవడం వల్ల చిన్నపిల్లలకు పెళ్లిళ్లు జరిగితే చాలా అనర్థాలు ఉంటాయని పేర్కొన్నారు.ఈ సదస్సులో సూపర్ వైజర్లు లింగమ్మ, కుంర సంధ్యరాణి, జంగుబాయి, నిర్మల్, ఐసీడీఎస్ సిబ్బంది పద్మ, పూజారి దీపక్ దుబే, తదితరులు పాల్గొన్నారు.

నేడు జొన్నల కొనుగోళ్ల నిలిపివేత : సీఈవో

తాంసి, మే 3: మండల కేంద్రంలోని సహకార సొసైటీ ఆధ్వర్యంలో కొనుగోలు చేస్తున్న జొన్నల కొనుగోలు శనివారం నిలిపివేయడం జరిగిందని సీఈవో కేశవ్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కొనుగోలు కేంద్రానికి జొన్నలు ఎక్కువగా రావడంతో స్థల భావం ఏర్పడటం వల్ల ఈ చర్యలు తీసుకున్నామని తెలిపారు. యధావిధిగా సోమవారం నుంచి మళ్లీ కొనుగోలు చేస్తామని, విషయాన్ని గమనించి జొన్న రైతులు సహకరించాలని కోరారు.

ఎంపీపీకి ఇన్‌చార్జీ బాధ్యతలు

ఉట్నూర్, మే 3: ఉట్నూర్ మండల పరిషత్ అధ్యక్షుడు పంద్రా జైవంతరావుకు బీఆర్ఎస్ ఇన్‌చార్జీ అధ్యక్షుడిగా బాధ్యతలను జిల్లా పార్టీ అధ్యక్షుడు జోగురామన్న ప్రకటించారు. ఉట్నూర్ బీఆర్ఎస్ అధ్యక్షుడు కందుకూరి రమేష్ పార్టీకి రాజీనామా చేయడంతో ఆయన స్థానంలో ఎంపీపీకి ఇన్‌చార్జీ బాధ్యతలు అప్పగించడం జరిగిందని తెలిపారు.

జొన్న పంట అగ్నికి ఆహుతి

తాంసి, మే 3: మండలంలోని పొన్నారి గ్రామంలో అగ్ని ప్రమాదం సంభవించింది. ఈ ప్రమాదంలో గ్రామానికి చెందిన గట్టు గంగయ్య ఏడు ఎకరాల జొన్న పంట అగ్నికి ఆహుతి అయ్యింది. ఆరుగాలం కష్టపడి పండించిన పంట అగ్నికి ఆహుతి కావడంతో బాధిత రైతు గంగయ్య బోరున విలిపించాడు. అగ్నిమాపక సిబ్బంది ఘనత స్థలానికి చేరుకుని మంటలను ఆర్పారు. రూ.50 వేల నష్టం వాటిల్లిందని, ప్రభుత్వమే ఆదుకోవాలని రైతు కోరారు.

అడ్డం తిరిగిన కాంగ్రెస్ నేతల కథ

- రెండు రోజుల్లోనే సస్పెన్షన్‌పై యూ టర్న్ తీసుకున్న పార్టీ
- ప్రశ్నార్థకంగా మారిన సీనియర్ నేతల రాజకీయ భవిష్యత్తు

ఆదిలాబాద్, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ నిర్ణయానికి వ్యతిరేకంగా పని చేసిన మాజీ డీసీసీ అధ్యక్షుడు సాజిద్‌ఖాన్, సీనియర్ నేతలు గండ్రత్ సుజాత, భార్గవ్‌దేవ్ పాండే, సంజీవ్‌రెడ్డిలపై కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానం గతంలో ఆరేళ్ల పాటు సస్పెన్షన్ వేటు వేసింది. పార్టీకి వ్యతిరేకంగా స్వతంత్ర అభ్యర్థిని ఎన్నికల బరిలోకి దింపి పార్టీకి వ్యతిరేకంగా పని చేశారంటూ నలుగురు సీనియర్ నేతలను దూరంపెట్టింది. ఇటీవలే జగ్గారెడ్డి ఆధ్వర్యంలో సీనియర్ నేతలంతా కాంగ్రెస్ కండువా కప్పుకోవడం పార్టీలో కలకలం రేపింది. వీరి చేరిక పై కందిశ్రీనివాస్‌రెడ్డి వర్గం ఆందోళన బాట పట్టింది. సీనియర్ నేతల చిత్రపటాలతో కూడిన ఫ్లెక్సీని దహనం చేసి పార్టీ కార్యాలయం వద్ద మౌనదీక్షతో నిరసన తెలిపారు. ఈ ఘటనను కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానం సీరియస్‌గా తీసుకుంది. జిల్లా ఇన్‌చార్జీ మంత్రి సీతక్కకు ఎలాంటి సమాచారం లేకుండానే సస్పెన్షన్‌కు గురైన నేతలను పార్టీలో చేర్చుకోవడం పై సీఎం రేవంత్‌రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలుస్తుంది. దీంతో నేతల సస్పెన్షన్ పై కాంగ్రెస్ పార్టీ యూ టర్న్ తీసుకుంది. ఆ నలుగురు సీనియర్ నేతలపై మరికొన్నాళ్ల పాటు సస్పెన్షన్ వేటు కొనసాగుతుందని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జయప్రకాష్‌రెడ్డి తాజాగా ఓ ప్రకటన విడుదల చేయడం కాంగ్రెస్ పార్టీలో చర్చనీయాంశంగా మారింది. దీంతో కాంగ్రెస్ సీనియర్ నేతల కథ మళ్లీ అడ్డం తిరిగిందన్న చర్చ సాగుతోంది. నియోజకవర్గ ఇన్‌చార్జీ కంది శ్రీనివాస్‌రెడ్డి సమ్మతితోనే వారిని పార్టీలో చేర్చుకునే అవకాశం ఉన్నట్లు తెలుస్తుంది. మొత్తానికి పార్టీ నిర్ణయాన్ని వ్యతిరేకించిన సీనియర్ నేతల రాజకీయ భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారిందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.



హైదరాబాద్‌లో గత రెండు రోజుల క్రితం జగ్గారెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరుతున్న జిల్లా నేతలు

బోథ్‌లో హోమ్ ఓటింగ్ ద్వారా ఓటు హక్కు

- వినియోగించుకున్న దివ్యాంగులు, వయోవృద్ధులు

తలమడుగు, మే 3: ఆదిలాబాద్ పార్లమెంట్ సాధారణ ఎన్నికలు 2024 లోక్‌సభ ఎన్నికల్లో తొలిసారి వృద్ధులు, వికలాంగుల కోసం కేంద్ర ఎన్నికల సంఘం ఓట్ ఫ్రమ్ హోమ్ అవకాశాన్ని కల్పించిందని ఆదిలాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి,జిల్లా కలెక్టర్ రాజార్షిషా అన్నారు. ఓట్ ఫ్రమ్ హోమ్‌లో భాగంగా ఎన్నికల సిబ్బంది సదరు ఓటరు ఇంటి వద్దకే వెళ్లి ఓటు వేయించే కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఆదిలాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంలోని బోథ్ సెగ్మెంట్‌లోని పాట్నాపూర్, బోథ్‌లో వయోవృద్ధులు, దివ్యాంగులు, ఓట్ ఫ్రం హోంలో భాగంగా శుక్రవారం తన ఇంటి నుంచే ఈసీఐ నిబంధనలకు అనుగుణంగా ఓటింగ్ కంపార్ట్మెంట్‌లో తమ ఓటు హక్కును వినియోగించుకోవడం జరిగింది. ఈ సందర్భంగా రిటర్నింగ్ అధికారి మాట్లాడుతూ 85 సంవత్సరాలు దాటిన వృద్ధులు, అంతేకాకుండా 40 శాతం కంటే ఎక్కువ వైకల్యం ఉన్న వారికి ఇంటి నుంచే ఓటు వేసేలా కేంద్ర ఎన్నికల సంఘం అవకాశం కల్పించిందని ఆయన ఈ సందర్భంగా తెలిపారు. దీనిలో భాగంగా ఆదిలాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంలో 803 మంది హోమ్ ఓటింగ్ వినియోగించుకోనున్నారని తెలిపారు. ఇందులో 85 సంవత్సరాలో పైబడిన వారు 416, వయోవృద్ధులు 384, మొత్తం 803 ఉన్నారు. ఈ కార్యక్రమంలో పీవో పాటిల్ వినోద్, మైక్రో అబ్జర్వర్ ప్రవీణ్, బీఎల్‌వో రాఘవేంద్ర, ఏపీఓ ఉమర్, పీసీలు ఊశన్న, సుధాకర్, ఎన్నికల సిబ్బంది బీఎస్‌వోలు, తదితరులు పాల్గొన్నారు.









ఓటు హక్కును వినియోగించుకుంటున్న వయోవద్ధులు, దివ్యాంగులు



ఎండలో సైతం కూలి పనులు చేస్తున్న ఉపాధి హామీ కూలీలు

మండే వేసవిలోనూ ముమ్మరంగా ఉపాధి పనులు

బోథ్, మే 3: మండే వేసవిలోనూ మండలంలో ఉపాధి హామీ పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. పనులను చేపట్టేందుకు కూలీలు తరలివస్తున్నారు. మార్చి మొదటి వారంలో 1,500 మంది కూలీలు పని చేయగా.. ప్రస్తుతం 7,078 మంది కూలీలు పని చేస్తున్నారు. ఎండలు తీవ్రంగా ఉన్న రెక్కాడితే డొక్కాడని కుటుంబాలు ఎంతో మంది ఉపాధి పనులు చేసేందుకు వస్తున్నారు. ఉపాధి హామీ కూలీ రేట్లు పెరగడంతో పాటు వారానికి ఒకసారి కూలీ డబ్బులు వస్తుండటంతో కూలీలు అధికంగా వస్తున్నారని అధికారులు అంటున్నారు.

గిరిజన గ్రామానికి మంచినీటి రాకతో ఆదివాసీల హర్షం

ఉట్నూర్, మే 3: దశాబ్దాలుగా మంచినీటి కష్టాలు ఎదుర్కొంటున్న ఆదివాసీ గిరిజనులకు ఎట్టకేలకు మంచినీరు అందుబాటులోకి రావడంతో ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల గుట్టపై ఉన్న చప్రాల గిరిజన గ్రామానికి వాగు వద్ద ప్రత్యేక బోరువేసి, పైపులైన్ల ద్వారా గ్రామానికి మంచినీరు చేరవేయడంతో శుక్రవారం గ్రామానికి వెళ్లిన పంచాయతీ కార్యదర్శి ప్రవీణ్‌కు స్వీట్లు తినిపిస్తూ గిరిజనులు ఆనందం పంచుకున్నారు. ఎన్నో ఏళ్లుగా ఇబ్బందులు పడుతున్న తమకు మండల ప్రత్యేక అధికారి దిలీప్‌కుమార్, పంచాయతీ ప్రత్యేక అధికారి సురేందర్, కార్యదర్శి ప్రవీణ్‌లు కష్టపడి తమ గ్రామానికి మంచినీరు అందేలా కృషి చేశారని.. దీనికి తోడు ఖానాపూర్ ఎమ్మెల్యే వెడమ బొజ్జుపటేల్ రూ.3లక్షలు అందించడంతో తమ సమస్య తీరిందని ఆదివాసీ గిరిజనులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.



గ్రామ కార్యదర్శి ప్రవీణ్‌కు స్వీట్లు తినిపిస్తున్న చప్రా గిరిజనులు